

బాబోయ్.. బంగారం..!

- గ్రాము ధర రూ.9,878
- వ్యాపారుల్లో భయాందోళన
- నేడు అక్షయ తృతీయ



నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మార్కెట్‌లో పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. సామాన్యులు కొనలేని స్థాయికి బంగారు ధరలు చేరిపోయాయి. ధనిక, పేద అనే తేడా లేకుండా పెళ్లిళ్ల, శుభకార్యాలు అంటే ముందుగా గుర్తుకువచ్చేది బంగారమే. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు బంగారు కొనుగోలు తప్పనిసరి. ధనవంతులు కాస్త ఎక్కువగా, మధ్య తరగతి ప్రజలు వారి స్థోమతకు తగ్గట్టుగా బంగారు నగలను కొనుగోలు చేస్తుంటారు. కానీ ఇటీవలి కాలంలో పసిడి ధరలు అందనంత ఎత్తుకు చేరాయి. ఎప్పటికప్పుడు పసిడి ధరలు ఆల్‌టైం రికార్డులను నమోదు చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇన్వెస్టర్లు బంగారంపై ఉంచుతున్నారు. దీంతో పాటు అమెరికా, చైనా దేశాల మధ్య జరుగుతున్న ఆర్థిక యుద్ధం నేపథ్యంలో మన దేశంలో బంగారు ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈక్రమంలో భారతీయులకు బుధవారం అక్షయ తృతీయ రోజున బంగారును కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది బంగారు గ్రాము ధర రూ.9,878గా ఉంది. ధర ఇలాగే ఉంటే అక్షయతృతీయ సందర్భంగా కొనుగోళ్లు తగ్గుతాయని వ్యాపారస్థులు ఆందోళన చెందుతున్నారు. నంద్యాల పట్టణంలో సూమారు 200కు పైగా బంగారు దుకాణాలు ఉన్నాయి. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో సుమారు మరో 100-200 దుకాణాలు ఉంటాయి. పెద్ద దుకాణాల్లో అక్షయ తృతీయ ఒక్కరోజే ఒక్కో దుకాణంలో రూ.30 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతుంది. చిన్న షాపుల్లో స్థాయిని బట్టి రూ.లక్ష నుంచి రూ.30లక్షల వరకు జరుగుతుంది. ఆరోజున ఉదయం ఆరు నుంచి రాత్రి 11 గంటల వరకు బంగారు దుకాణాలు కళకళలాడుతాయి.

పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారం బాగుంది



సామాన్యులు బంగారు దుకాణం వైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కాబట్టి వ్యాపారం బాగానే ఉంది. పేదవారు తాళిబొట్టు తప్ప మరేం కొనడం లేదు. గతంలో మా దుకాణంలో రోజుకు సుమారు రూ.25 లక్షల వ్యాపారం జరిగేది. ధరలు పెరిగిపోవడంతో వ్యాపారం గతేడాది కన్నా మందగించింది. ధర ఇలాగే ఉంటే అక్షయ తృతీయ రోజున కూడా కొనుగోళ్లు తగ్గే అవకాశం ఉంది.

\- నాగమహేష్, భవనాశి జ్యూవెలర్స్, నంద్యాల

916 బంగారం కొనాలంటే

ప్రజలు ఆభరణాల్లో 916 హాల్‌మార్క్ బంగారాన్నే కొంటారు. మంగళవారం నంద్యాలలో ఓ గ్రాము 22 క్యారెట్(916) బంగారం ధర రూ.8,913 ఉంది. దీనికి 3శాతం జీఎస్టీ, ఆభరణాన్ని బట్టి మేకింగ్ చార్జీలు కలిపితే మరో రూ.640 అదనం. మొత్తంగా ఓ గ్రాము బంగారు ఆభరణం కొనాలంటే రూ.9,700 వరకు చెల్లించాల్సిందే. ఓ తులం బంగారం కొనాలంటే దాదాపుగా రూ.లక్ష ఖర్చు పెట్టాల్సి వస్తోంది. 24 క్యారెట్ బంగారం ధర ఎప్పుడో లక్ష దాటేసింది. మంగళవారం నంద్యాలలో 24 క్యారెట్ బంగారం ధర రూ.9,900గా ఉంది. దీనికి జీఎస్టీ, మేకింగ్ చార్జీలు అదనం.

ధరల పెరుగుదలకు కారణమిదే..!

అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య పోరుతో పాటు డాలర్ బలహీనపడడం వంటి కారణాలతో మదుపరులు బంగారం వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదే కాకుండా ప్రభుత్వం కూడా గోల్డ్ నిల్వలు పెంచుకుంటూ ఉంది. యూఎస్ ఎకానమీ పడిపోవడం, డాలర్ మీద నమ్మకం సన్నగిల్లడంతో బంగారంపై పెట్టుబడులు పెట్టడం ప్రత్యామ్నాయంగా మారింది. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం 3,319 డాలర్లకు చేరువలో ఉంది.



పల్లె పల్లెన మినీ గోకులాలు

పశు పోషకులకు చేయూత అందించేందుకు, పాడి రైతులను ప్రోత్సహించేందుకు 2018లో తెలుగుదేశం ప్రభుత్వం మినీ గోకులాలను ప్రారంభించింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ మినీ గోకులాలపై దృష్టి సారించింది. 2018లో నిర్మించిన మినీ గోకులాలకు బిల్లులు చెల్లించి నూతనంగా మరిన్ని గోకులాలు నిర్మించేందుకు పచ్చజెండా ఊపింది. దీంతో గ్రామ గ్రామాన గోకులాలు వెలిశాయి. జిల్లాలో గోకులం పథకం కింద పశువుల షెడ్ల నిర్మాణానికి 90శాతం రాయితీ, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి 70శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తోంది.

- కూటమి ప్రభుత్వంతో రైతుల్లో ఆశలు
- బిల్లులు చెల్లించని గత వైసీపీ ప్రభుత్వం
- తిరిగి ఊపందుకున్న పాడి పరిశ్రమ



మహానంది మండలంలో నిర్మించిన గోకులం షెడ్డు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 28 మండలాలకుగాను మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సహకారంతో 854 షెడ్లు మంజూరయ్యాయి. వాటిలో 539 పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. రెండు పశువులున్న రైతులకు రూ.1,15,000, నాలుగు పశువులున్న రైతులకు 1,85,000, ఆరు పశువులు ఉన్న రైతులకు 2,30,000గా కేటాయించారు. మొత్తం 854లో 539 పూర్తికాగా 23 రూఫ్ లెవల్లో, 194 బేస్‌మెంట్ లెవల్లో, 22 ఎర్త్‌వర్క్ లెవల్లో, 26 గ్రౌండ్ లెవల్లో ఉన్నాయి.

పశువులు	మొత్తం	రైతువాటా	సబ్సిడీ
6	2,30,000	23,000	2,07,000
4	1,85,000	18,500	1,66,500
2	1,15,000	11,500	1,03,500

నాలుగు క్లస్టర్లుగా విభజన

జిల్లాలో గోకులం షెడ్ల నిర్మాణాలను జిల్లా అధికారులు నాలుగు క్లస్టర్‌లుగా విభజించారు. నంద్యాల క్లస్టర్‌లో నంద్యాల మండలానికి 24, పాణ్యం 45, గోస్పాడు24, మిడ్తూరు 51, గడివేముల 45, శిరువెళ్ల 14, మహానంది 28, బండి ఆత్మకూరు 23 షెడ్లు మంజూరయ్యాయి. కోవెలకుంట్ల క్లస్టర్‌లో కోవెలకుంట్ల 23, ఆళ్లగడ్డ 26, రుద్రవరం 23, సంజామల 30, కొలిమిగుండ్ల 19, దొర్నిపాడు 13, చాగలమర్రి 25, ఉయ్యాలవాడ 18 షెడ్లు మంజూరయ్యాయి. డోన్ క్లస్టర్‌లో డోన్ 24, బేతంచర్ల 32, బనగానపల్లె 56, అవుకు 30, ప్యాపిలి 65షెడ్లు మంజూరయ్యాయి. అలాగే ఆత్మకూరు క్లస్టర్‌లో ఆత్మకూరు 34, పగిడ్యాల 52, నందికొట్కూరు 28, జూపాడుబంగ్లా 33, పాములపాడు 23, కొత్తపల్లె 22, వెలుగోడు 24 షెడ్లు మంజూరయ్యాయి. దీనితో తిరిగి పాడి పరిశ్రమ ఊపందుకోనుంది.

జిల్లాలో అత్యధికంగా పశుసంపద

జిల్లాలో అనేక గ్రామాల్లో పాడిపరిశ్రమపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. ఆవులు, గేదెలు, మేకలు, కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నాయి. జిల్లాలో బర్రెలు ఆవులు కలిపి 2,35,434 ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు.



ప్యాపిలి మండలంలో నిర్మించిన గోకులం షెడ్డు

మండలం	బర్రెలు, ఆవుల సంఖ్య
మహానంది, నంద్యాల	24,786
గడివేముల, పాణ్యం	27,042
ప్యాపిలి	40,524
వెలుగోడు, బండిఆత్మకూరు	
పాములపాడు	38,625
బేతంచర్ల	20,890
జూపాడుబంగ్లా, పగిడ్యాల	16,230
సంతజూటూరు, మిడ్తూరు	19,107
ఆత్మకూరు, కొత్తపల్లె, శ్రీశైలం	28,113



బిల్లుల చెల్లింపులో ఆలస్యం

ఎంతో ఉత్సాహంగా మినీ గోకులాలను రైతులు ప్రారంభించారు. పనులు పూర్తయిన 538 షెడ్ల నిర్మాణానికి రూ.8 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. మొదటి విడతలో కొంత మంది రైతులకు సుమారు రూ.4కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. మరో నాలుగు కోట్ల రూపాయలు ఆలస్యం కావడంతో అనేక మంది కొత్తగా నిర్మించుకున్న రైతులకు బిల్లులు ఆలస్యమయ్యాయి. దీంతో అక్కడక్కడా రైతుల్లో కొంత నైరాశ్యం అలముకుంది.

ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది



షెడ్ల నిర్మాణానికి ప్రోత్సహిస్తూ ప్రభుత్వం రైతులకు మంచి అవకాశం కల్పించింది. నాకు నాలుగు పశువులున్నాయి. రూ.1.85లక్షలతో షెడ్డు నిర్మాణానికి మంజూరు చేసింది. రెండు నెలల క్రితమే షెడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశాం. బిల్లులు మంజూరు కాలేదు.

\-వెంకటేశ్వర్లు,బుక్కాపురం, మహానంది మండలం

బిల్లు మంజూరు చేయండి



పశువులకు ఆరు బయట ఇబ్బందికరంగా ఉండడంతో అప్పులు చేసి షెడ్డు నిర్మించుకున్నాం. బిల్లులు ఆలస్యమైతే తీవ్రంగా నష్టపోతాము. వెంటనే బిల్లులు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- శ్రీనివాసులు, రైతు

త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం



సుమారు రూ.8 కోట్లతో పనులు ప్రారంభించాం. ప్రభుత్వం నుంచి రూ.4కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. మరో రూ.4 కోట్లు రావాల్సి ఉంది. ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే అన్ని బిల్లులు మంజూరు చేస్తాం. ఎవ్వరూ ఎలాంటి నిరాశ చెందనవసరం లేదు.

\- వెంకటసుబ్బయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలి

- ఏపీఎంసీఏ అధ్యక్షుడు శివకృష్ణ
- మోకాళ్లపై నిలబడి నిరసన
- రెండేళ్లుగా పరిష్కారం కాని సమస్యలు : సీహెచ్‌వోలు



నంద్యాలలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న సీహెచ్‌వోలు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని నంద్యాల జిల్లా ఏపీఎంసీఏ అధ్యక్షుడు శివకృష్ణ అన్నారు. పట్టణంలో తాలుకా పోలీస్‌స్టేషన్ పక్కన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరసన రెండో రోజుకు చేరుకున్నది. మంగళవారం మోకాళ్లపై నిలబడి సీహెచ్‌వోలు నిరసన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా జీతభత్యాలపై వినతిపత్రాలు ఇస్తున్నా సమస్య పరిష్కరించడంలేదని సీహెచ్‌వోలు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎంకింద ఆరేళ్లుగా సీహెచ్‌వోలు పనిచేస్తున్నా జీతంలో ఎలాంటి పురోగతిలేదన్నారు. ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా జీతంతో పాటు ప్రోత్సాహకాలు, ప్రతిసంవత్సరం ఐదు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య, కార్యదర్శి గురుప్రసాద్, కోశాధికారి అఖిల్, భార్గవ్, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

మండే ఎండలో వర్ష సూచన



నంద్యాలలో నిర్మానుష్యంగా ఉన్న ఆర్ఎఫ్ రోడ్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో భగభగలాడే ఎండల్లో కూడా మంగళవారం సాయంకాలం కాగానే వర్ష సూచనతో చల్లబడింది. రానున్న మూడు రోజుల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీలతో ఎండలు మంచిపోయినా సాయంత్రం 4ఎంఎం నుంచి 40 ఎంఎం వరకు వర్షం పడే అవకాశముందని వాతావరణ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడిస్తోంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 10నుంచి 16 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని, గాలిలో తేమశాతం ఉదయం 50నుంచి 54శాతం, మధ్యాహ్నం 17 నుంచి శాతం నమోదయ్యే అవకాశముందని వెల్లడించింది. 1,2,3,4వ తేదీల్లో సాయంత్రం ఉరుములు, మెరుపులు బలమైన గాలులు వీచే అవకాశముందని తెలిపింది.

- కర్నూలు జిల్లాలో మంగళవారం మంత్రాలయంలో 40.90. కోడుమూరులో 40.79, కోసిగి 40.40, ఎమ్మిగనూరు 40.23, కౌతాళం 39.50, కల్లూరు 39.50, ఓర్వకల్లు 39.40, దేవనకొండ 39.29, వెల్దుర్తి 39.23, హొళగుంద 39.00 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.
- నంద్యాల జిల్లాలో కోవెలకుంట్ల 40.95, మహానంది 40.93, రుద్రవరం 40.67, కొత్తపల్లె 40.48, బండిఆత్మకూరు 40.42, పాణ్యం 40.29, గడివేముల 40.27, బనగానపల్లె 40.24, శిరువెళ్ల 40.22, జూపాడుబంగ్లా 40.04 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

వందశాతం ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈవో జనార్ధన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చే విద్యాసంవత్సరం అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో వంద శాతం ఫలితాల సాధనకు కృషిచేయాలని హెచ్‌ఎంకు డీఈవో జనార్ధన్‌రెడ్డి కోరారు. నేషనల్ వీజీ కళాశాలలో మంగళవారం ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలతో 'పది' ఫలితాలపై డీఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేలో నిర్వహించబోయే సప్లిమెంటరీ పరీక్షల సన్నద్ధత, ప్రత్యేక తరగతుల నిర్వహణ, రాబోయే విద్యాసంవత్సరం చేపట్టాల్సి న ప్రణాళికపై చర్చించారు. డీఈవో మాట్లాడుతూ రాబోయే విద్యాసంవత్సరంలో వందశాతం ఫలితాలను సాధించడం బాధ్యతగా తీసుకోవాలని అన్నారు.

హెరిటేజ్ గుర్తింపునకు శ్రమించాం

- అప్పట్లో రూ.3.02 కోట్లకే విక్రయం
- సర్ ఆర్థర్ కాటన్ సలహాతో వ్యవసాయానికి వినియోగం
- కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సీమ జీవనాడి కేసీ కెనాల్‌గా ప్రసిద్ధి చెందిన కర్నూలు-కడప కాలువకు హెరిటేజ్ గుర్తింపు రావటానికి చాలా శ్రమించినట్లు కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్ తెలిపారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. భారత్‌లో ఉన్న డచ్ కంపెనీ 18 వ శతాబ్దంలో 1863-70 మధ్య సరుకు రవాణా నిమిత్తం కేసీ కెనాల్‌ను నిర్మిం చిందన్నారు. సుమారు 13 సంవత్సరాల పాటు కేసీ కెనాల్‌ని నిర్వహించిన డచ్ కంపెనీకి లాభాలు ఆశించినంత రాకపోవటంతో కేసీ కాలువను 1883 జులైలో బ్రిటీష్ కంపెనీకి రూ. 3.02 కోట్లతో విక్రయించిందని తెలిపారు. డచ్ కంపెనీ నుంచి కేసీ కెనాల్‌ను కొన్న బ్రిటీషర్స్ దవళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజనీర్ సర్ ఆర్థర్‌కాటన్ సలహామేరకు కేసీ కెనాల్ సరుకు రవాణాతో పాటు వ్యవసాయానికి వినియోగించారు. 305 కిలోమీటర్ల నిడివితో కేసీ ఉమ్మడి కర్నూలు జిల్లా, కడప జిల్లాలోని 13అసెంబ్లీ నియోజకవర్గాల గుండా ప్రయాణిస్తోందన్నారు. 2,65,628లక్షల స్థిరీకరించిన ఆయకట్టు రైతాంగానికి జీవనాడిలా మారిన కేసీ కెనాల్ హెరిటేజ్‌కు గుర్తింపు రావటం యావత్తు సాగునీటి శాఖ ఇంజనీర్లకే గర్వకారణమని ఆనందం వ్యక్తంచేశారు. ఈగుర్తింపు రావటానికి కేసీ యంత్రాం గం పలు డాక్యుమెంట్లను సంబంధిత సంస్థ ఇంటర్నేషనల్ కమిషన్ ఫర్ ఇరిగేషన్ అండ్ డ్రైన్స్ (ఐసీఐడీ)కు సమర్పించగా సంస్థ అంతర్జాతీయ స్థాయిలో పలు సాగునీటి పారుదల ప్రాజెక్టులను పరిశీలించిన తర్వాతే కేసీ హెరిటేజ్ గుర్తింపు ఇచ్చిందని ప్రతాప్ తెలిపారు.

పారిశ్రామిక కారిడార్లలో రైల్వేలైన్ల అభివృద్ధి కీలకం

- ఓర్వకల్లు కారిడార్‌కు 53 కిలోమీటర్ల పనులు చేపట్టాలి
- కృష్ణపట్నం పారిశ్రామిక నోడ్ వరకు 12 కి.మీ.
- ఇవి అభివృద్ధి చెందితే 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కి మంత్రి టీజీ భరత్ వినతి



కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక కారిడార్లలో రైల్వే లైన్ల అభివృద్ధి ఎంతో కీలకమని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి ఓ వినతి పత్రం ద్వారా రాష్ట్రంలో రైల్వే లైన్ల అభివృద్ధికి సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఇండస్ట్రీయల్ కారిడార్ల అభివృద్ధి వేగంగా జరిగేందుకు పూర్తిగా సహకరించాలని, ఓర్వకల్ నోడ్, చైన్నయ్ - బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ కింద కృష్ణపట్నం నోడ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ నోడ్‌లకు రైల్వే కనెక్టివిటీల కోసం అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రికి వివరించానని తెలిపారు. ఓర్వకల్లు నోడ్ కింద దూపాడు రైల్వేస్టేషన్ నుంచి ఓర్వకల్లు మీదుగా బేతంచెర్ల వరకు కొత్త రైల్వేలైన్ అభివృద్ధి, ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌వరకు రైల్వేసైడింగ్ 53 కిలోమీటర్ల అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో పాటు కృష్ణపట్నం రైల్వేస్టేషన్ నుంచి ఓబులవారిపల్లె- కృష్ణపట్నం సెక్షన్ నుంచి కృష్ణపట్నం పారిశ్రామిక నోడ్ వరకు రైల్వే సైడింగ్ 12 కిమీ అభివృద్ధి చేయాలని కోరారు. ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లను ఆధునిక మౌలిక సదుపాయాలతో పాటు ఇంటిగ్రేటెడ్ మల్టీ మోడల్ లాజి స్టిక్స్ పార్కులతో స్థిరమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇవి అభివృద్ధి చెందితే 4లక్షలకు పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని చెప్పారు. విదేశీ పెట్టుబడులతో సహా సుమారు రూ.55వేల కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్- బెంగళూర్ ఇండస్ట్రీయల్ కారిడార్ కింద ఓర్వకల్, వైజాగ్-చైన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కింద కొప్పర్తి నోడ్‌ను ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆమోదించినట్లు తెలిపారు. 73 నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ సమావేశంతో పాటు డీపీఐఐటీ సమావేశాల్లో రాష్ట్రంలో అవసరమైన పారిశ్రామిక నోడల్‌కు రైలు కనెక్టివిటీని అందించాలని సూచించింది. ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లకు ప్రతిపాదిత రైల్వేసైడింగ్ లైన్ల అభివృద్ధిని చేపట్టడానికి ప్రభుత్వ ప్రతిపాదనలను రైల్వే శాఖ వీలైనంత త్వరగా ఆమోదించేలా చూడాలని కోరారు. ఈ నోడ్‌లకు రైల్వే కనెక్టివిటిని మెరుగు పరచడం వల్ల లాజిస్టిక్స్ పార్కులు, కార్గో టెర్మినల్స్, ఓడరేవులకు వస్తువులను తరలించేందుకు వీలు ఉంటుందని తెలిపారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న శివసేవకులు

శ్రీశైలం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈనెల ఒకటో తేదీ నుంచి 28వ తేదీ వరకు సమకూరిన ఆదాయాన్ని లెక్కించగా రూ.3,61,42,016 రాబడిగా వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. నగదుతో పాటు 10.54 తులాల బంగారు, 4.860 కిలోల వెండి వచ్చినట్లు తెలిపారు. అలాగే వివిధ దేశాల కరెన్సీ హుండీ లెక్కింపులో లభించినట్లు తెలిపారు. హుండీ ఆదాయం లెక్కింపులో డిప్యూటీ ఈఓ రమణమ్మ, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.



హైక్లాసులకు ఎస్జీటీలా?

సంస్కరణలన్నీ మంచివని భ్రమపడాల్సిన పని లేదు. ఆ పేరుతో గతం కంటే అధ్వానమైన పరిస్థితి తేవచ్చు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యావిధానంలో భాగంగా వచ్చే ఏడాది నుంచి తేనున్న మార్పులు ఉదాహరణ. ప్రాథమికోన్నత పాఠశాలలు హైస్కూళ్లలో విలీనం అవుతాయి. దీని వల్ల ఆరో తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ల బదులు సెకెండ్ గ్రేడ్ టీచర్లు చదువు చెప్పే పరిస్థితి వస్తుంది. ఈ విధానం వల్ల విద్యార్థులు పూర్తిగా నష్టపోయే ప్రమాదముందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

- విద్యావిధానంలో వింత పోకడలు
- అగమ్యగోచరంగా 6 నుంచి 8వ తరగతి విద్యార్థుల చదువు
- ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్న ఉపాధ్యాయ సంఘాలు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సహజంగా 6వ తరగతి నుంచి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లు బోధించాలి. కాని వచ్చే ఏడాది నుంచి అమలు కానున్న నూతన సంస్కరణల్లో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలలు హైస్కూళ్లలో విలీనం అవుతాయి. నంద్యాల జిల్లాలో 96 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా అందులో 50 పాఠశాలలను హైస్కూళ్లగా మార్చారు. 18 పాఠశాలల్లో విద్యార్థులు తగినంత సంఖ్య ఉండడంతో ఎలాంటి మార్పు చేయకుండా వాటిని అక్కడే హైస్కూల్‌గా ఉన్నతీకరించారు. మిగిలిన 28 ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా, మోడల్ పాఠశాలలుగా చేశారు. 28 పాఠశాలల్లో 6,7,8 తరగతి చదివే విద్యార్థులు 60లోపు ఉన్నట్లు విద్యాశాఖాధికారులు గుర్తించారు 60 మంది లోపు విద్యార్థులను కూడా సమీపంలోని హైస్కూల్స్‌లో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు అధికారుల ద్వారా తెలియజేశారు. కాని హైస్కూల్స్ ఐదు కిలోమీటర్ల కంటే దూరం ఎక్కువగా ఉండడంతో పాటు పలు పాఠశాలల్లో స్థానిక సమస్యలను చూపుతూ స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను దూరంగా ఉన్న పాఠశాలల్లో చేర్చేది లేదని, అక్కడే ఉంటారని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఆయా పాఠశాలలను అక్కడే కొనసాగించారు. 10 మంది విద్యార్థులున్న చోట ఇద్దరు ఎస్జీటీలు, 11నుంచి 30 మంది విద్యార్థులు ఉన్నచోట ముగ్గురు ఎస్జీటీలు, 31 నుంచి 40 మంది దాటితే ఐదుగురు ఎస్జీటీలను కేటాయించడం పట్ల కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 6 నుంచి 8వరకు చదువుతున్న విద్యార్థులకు ఎస్జీటీలను కేటాయించడమేమిటని, విద్యాప్రమాణాలు దెబ్బతింటాయని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

విద్యార్థులు తక్కువగా ఉన్న చోట ఎస్ఏలను ఇవ్వలేము



విద్యార్థులు తక్కువగా ఉన్న చోట ఎస్ఏలను ఇవ్వలేము. పలు ప్రాథమిక పాఠశాలలకు హైస్కూళ్లు దూరంగా ఉన్నాయి. ఆ విద్యార్థులకు ట్రావెల్స్ అలవెన్స్ కూడా ఇస్తామని చెప్పాం. అనేక ప్రాథమికోన్నత పాఠశాలల్లో 10 మంది కూడా విద్యార్థులు లేరు. 60 మంది విద్యార్థులకన్నా ఎక్కువగా ఉన్న పాఠశాలలను హైస్కూల్‌గా మార్చాం.

\- జనార్దన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల

స్కూల్ అసిస్టెంట్లతోనే బోధించాలి



ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు తప్పనిసరిగా స్కూల్ అసిస్టెంట్లతోనే బోధించాలి. అప్పర్ ప్రైమరీ పాఠశాలలను తొలగించడంలో భాగంగా ఏర్పడిన గందరగోళం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. హైస్కూల్స్ దూరంగా ఉండడం కూడా ఒక కారణంగా చెబుతున్నప్పటికీ ఎలాంటి పరిస్థితుల్లో 6,7,8 తరగతి విద్యార్థులకు ఎస్జీటీలతో బోధించడం మంచిది కాదు.

\- రామఫక్కీరారెడ్డి, పీఆర్‌టీయూ యూనియన్

ఎస్జీటీలకు ప్రమోషన్‌లు కల్పించాలి



ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు తప్పనిసరిగా సబ్జెక్టు టీచర్లే బోధించాలి. లేదంటే ఎస్జీటీలకు శిక్షణనిచ్చి ఎస్ఏలుగా ప్రమోషన్‌లు కల్పించి వారితో చదువు చెప్పించాలి. అందరికీ సమన్యాయమైన విద్యను అందించాలి.

\- శివయ్య, ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు

శాస్త్రీయంగా లేదు



ఒకే తరగతి విద్యార్థులకు ఒకరికి ఎస్ఏలతో, మరొకరికి ఎస్జీటీలతో బోధించడం శాస్త్రీయంగా లేదు. ప్రభుత్వం పునరాలోచించాలి. 70 మంది కంటే విద్యార్థులు తక్కువగా ఉన్న చోట ప్రధానోపాధ్యాయులు, పీఈటీ ఉండరని చెప్పడం వల్ల పర్యవేక్షణాలోపం ఏర్పడుతుంది.

\- ప్రసాద్, యూటీఎఫ్ నాయకుడు

విలీన ఆలోచన విరమించుకోవాలి



ఉన్నత పాఠశాలలో ప్రాథమిక తరగతులను విలీనం చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్జీటీలతో చదువు చెప్పించడం సమంజసం కాదు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సంస్కరణలను పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతనే నిర్ణయాలు తీసుకోవాలి.

\- శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ నాయకుడు



మిరప రైతు కుదేలు

దిగుబడి తగ్గి, ధరలు లేక కన్నీటి కష్టాలు



కుప్పలుగా పోసిన మిరప పంట



రేవనూరులో మిరప పంటను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

మండలాల వారీగా మిరప పంట సాగు ఇలా...		
మండలం	సాధారణసాగు (హెక్టార్లలో)	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
కోవెలకుంట్ల	993	936
దొర్నిపాడు	388	163
ఉయ్యాలవాడ	427	417
సంజామల	1506	1263
అవుకు	1015	802
కొలిమిగుండ్ల	417	329

కోవెలకుంట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కోటి ఆశలతో మిరపను సాగు చేసిన రైతులకు కన్నీటి కష్టాలు తప్పడంలేదు. గత రెండు సంవత్సరాల నుంచి ఇదే పరిస్థితి. రూ. లక్షలు పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేస్తే ఓ వైపు దిగుబడులు రాక మరో వైపు మార్కెట్లో ధరలు లేక మిరప రైతులు కుదేలవుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలకు కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, కోవెలకుంట్ల మండలాలున్నాయి. ఈ మండలాల్లో మిరప సాగు విస్తీర్ణం 4.746 హెక్టార్లు కాగా సుమారు 3.910 హెక్టార్లలో పంట సాగు అయింది. చాలా మంది రైతులు మిరపను సాగు చేయాలంటే బోర్ల కింద నీటి వసతి ఉన్న భూముల్లోనే ఈ పంట సాగు చేయాలి కాబట్టి నీటి వసతి ఉన్న భూములు దాదాపు 50వేల నుంచి రూ.70వేల వరకు కౌలుకు భూములు తీసుకుని ఎరువులు, విత్తనాలు, నీరు సేద్యం ఇలా అన్నీ కలుపుకుని ఎకరాకు సుమారు రూ.2లక్షల నుంచి రూ.2.50లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. పంటకు కోత పనులు కూడా జరిగాయి. ప్రస్తుతం పంట కల్లాల్లో కుప్పలుగా ఆరబోశారు. ఎకరాకు 25 నుంచి 30క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి కేవలం 10 నుంచి 12 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటం ధర రూ.10వేల నుంచి రూ.12వేలు పలుకుతోంది. రెండేళ్ల కిందట క్వింటం రూ.23వేల నుంచి రూ.26వేలు వరకు ఉండగా, గత ఏడాది రూ.14వేల నుంచి 17వేల వరకు తగ్గింది. ప్రస్తుతం ఈ ఏడాది ధరలు బాగా తగ్గడంతో కనీసం పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులు, ఉన్న ధరలతో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పలువురు రైతులు అంటున్నారు.

తెగుళ్లతో దిగుబడి సరిగా రాలేదు



ఐదెకరాల్లో మిరప పంట సాగు చేశా. ఎకరాకు 2 నుంచి రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. తెగుళ్ల సోకి పంట దిగుబడి సరిగా రాలేదు. వచ్చిన పంటకు కూడా గిట్టుబాటు ధర రాకపోవడంతోపెట్టిన పెట్టుబడులు కూడా రాక దాదాపు ఐదు లక్షల వరకు అప్పులు అయ్యాయి. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

\- గార్లపాటి రమణారెడ్డి

మార్కెట్‌లో ధర లేదు



ఆరు ఎకరాల్లో కౌలుకు తీసుకుని ఎకరాకు 40వేలు చొప్పున కౌలు తీసుకుని మిరప పంట సాగు చేశాను. పెట్టుబడికి మాత్రం ఎకరాకు రూ.3లక్షల వరకు వచ్చింది. పంట మాత్రం అంతంత మాత్రమే రావడంతో వచ్చిన పంట ధర లేకపోవడంతో ఎకరాకు లక్షన్నర వంతున రూ.9 లక్షలు నష్టం వాటిల్లింది.

\- జి. రామమద్దిలేటి

సాగునీటి పన్ను వసూలుకు చర్యలు: కలెక్టర్



నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి పేరుకుపోయిన సాగునీటి పన్ను బకాయి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సాగునీటి పన్ను వసూళ్లు, ఆయకట్టు స్థిరీకరణపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టుల ద్వారా అందుతున్న సాగునీరుకు సంబంధించి మాన్యువల్ ప్రకారం దాదాపు రూ.20 కోట్ల డిమాండ్ మేర సాగునీటి పన్ను వసూలు చేయాల్సి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న పన్ను వసూళ్లను త్వరలోనే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, కర్నూలు, నంద్యాల జిల్లాల నీటిపారుదల శాఖ ఎస్‌ఈలు శేఖర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

29 యూనిట్లకు రూ.4.50 కోట్ల రాయితీలు

జిల్లాలో 29 యూనిట్లకు రూ.4.50 కోట్ల మేర రాయితీలు మంజూరైనట్లు కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్‌రేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పారిశ్రామిక కమిటీ సమావేశాలు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. పీఎం విశ్వకర్మ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో 2025-26 ఆర్థిక సంవత్సర మహిళల వ్యవస్థాపకత కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నోవిధాలుగా చేయూతనిస్తోందని అన్నారు.

నిప్పు.. ముప్పు



నంద్యాల జిల్లా అగ్నిమాపక కార్యాలయం

వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలతో ముప్పు పొంచి ఉంది. రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. ప్రజల్లో అవగాహన లోపం ఒక ఎత్తైతే కనిపించని నిర్లక్ష్యం లావాలా వ్యాపిస్తోంది. ఇల్లు, పరసరాలు భద్రమేనా అని ఎవరికి వారు ప్రశ్నించుకుని దైనందిన జీవితంలో జాగ్రత్తగా ఉంటే అగ్ని ప్రమాదాలకు అవకాశముండదని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. గడిచిన రెండేళ్లలో నంద్యాలల్లో 428 అగ్నిప్రమాదాలు జరిగాయి. అనధి కారికంగా చిన్నాచితకా మరో వంద వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- వేసవిలో తస్మాత్ జాగ్రత్త
- ముదురుతున్న ఎండలు
- అగ్నిప్రమాదాలకు ఆస్కారం
- ప్రజల్లో అవగాహన లోపం
- పలు మండలాలకు ఒక్కటే ఫైరింజన్
- గత రెండేళ్లలో 428 ప్రమాదాలు
- అగ్నిప్రమాదాల నివారణకు అధికారుల సూచనలు

నంద్యాల టౌన్ ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, నందికొట్కూర్, ఆత్మకూరు, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో అగ్నిమాపక శాఖ కేంద్రాలు ఉన్నాయి. చాలా మండలాలకు సుమారుగా 30 కి.మీ దూరం వరకు ఒకటే ఫైరింజన్ ఉండడంతో బాధితులు ఫోన్ చేసి వారు వచ్చే సరికే జరగాల్సిన కాస్త నష్టం జరుగుతుంది. నంద్యాల నుంచి బండిఆత్మకూరు, శిరివెళ్ల, గడివేముల, గోస్పాడు పాణ్యం, మహానంది వంటి మండలాలకు ఒకటే ఫైరింజిన్ ఉంది. జిల్లా కేంద్రంలో కూడా ఒకటే ఫైర్ ఇంజిన్ ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆళ్లగడ్డ నుంచి కోవెలకుంట్ల, బనగానపల్లె నుంచి అవుకు, కొలిమిగుండ్ల, సంజామల వంటి మండలాలకు కూడా ప్రమాదం జరిగినప్పుడు వెళ్లాలంటే సమయం ఎక్కువగా పట్టడంతో అగ్నికి అహుతి అవుతున్నాయి.

ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కొత్త గ్యాస్ సిలిండర్‌ను తెచ్చిన వెంటనే లీకేజీలు ఉన్నాయా, అనేది నిర్ధారించుకొని వాడాలి. లీకేజీ ఉన్న సిలిండర్ వస్తే వెంటనే గ్యాస్ ఏజేన్సీలకు సమాచారమివ్వాలి. నాణ్యమైన ట్యూబ్‌ను ఉపయోగించుకోవాలి.
- వంట చేసే సమయంలో కిటికీలు, తలుపులు తెరిచి ఉంచాలి.
- పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాముల చుట్టూ అగ్ని నిరోధక పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలి. చిన్న అగ్గిరాజుకున్న నివారణ చర్యలు చేపట్టే విధంగా జాగ్రత్తలు ఉండాలి.
- గ్రామాల్లో ఎక్కడ దూమపానం చేసిన బీడీ, సిగరెట్ ముక్కలను ఎక్కడ పడితే అక్కడ పడివేయకుండా పూర్తిగా ఆర్పివేయాలి.



అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అర్పుతున్న ఫైర్ సిబ్బంది. (ఫైల్)

అవగాహన అవసరం



అగ్నిప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకోక ముందే అక్కడ ఉన్నవారే సహాయక చర్యలు చేపట్టాలంటే అవగాహన అవసరం. దీంతో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ఉంటుంది. అందుకే అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.

\-యోగేశ్వరరెడ్డి, అసిస్టెంట్ డీఎఫ్‌వో, నంద్యాల

గుండెకు చికిత్స ఏదీ..?

- కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌లేని జీజీహెచ్.. ఊసే లేని కార్డియాలజిస్టులు
- హృద్రోగులకు తప్పని తిప్పలు
- అత్యవసరమైతే ప్రైవేటుకు వెళ్లాల్సిందే..
- ఆస్పత్రి స్థాయి పెరిగినా.. నిర్లక్ష్యం



నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి

నంద్యాల జిల్లాగా అవతరించినా.. నేటికీ జిల్లా వాసులకు వైద్య సేవలు అంతంత మాత్రమే. ప్రభుత్వాస్పత్రిని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్)గా స్థాయిని పెంచారు. అయినా నిర్లక్ష్యపు నీడలో జీజీహెచ్ కొట్టుమిట్టాడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సిందే. కనీసం కార్డియాలజీ డిపార్ట్‌మెంటు లేదు. కార్డియాలజిస్టు ఊసే లేదు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో తాత్కాలిక వైద్యంచేసి కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. జిల్లాలో హృద్రోగ బాధితులు అధికంగా ఉన్నట్లు ఇటీవలే సర్వేలో వెల్లడైంది. ఈ ఆసుపత్రిలో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ ఏర్పాటుకు అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.


ఆసుపత్రిలోని ఐసీయూ వార్డు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పేరుకే ప్రభుత్వ సర్వజన వైద్యశాల. అక్కడ వైద్యసేవలు మాత్రం అంతంత మాత్రమే. ముఖ్యంగా గుండె చికిత్సకు సంబంధించి ఎలాంటి వైద్యం ఇక్కడ అందదు. అత్యవసరమైతే ప్రాణాలు అనంత వాయువుల్లో కలవాల్సిందే. గుండె సంబంధిత వ్యాధుల రోగులు జీజీహెచ్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారు. జీజీహెచ్‌లో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ లేకపోవడమేకాక గుండె వైద్య నిపుణులు ఒక్కరూ కూడా లేరు. దీంతో గుండె సంబంధిత రోగులను ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకొని ఎమర్జెన్సీ వార్డులో తాత్కాలిక చికిత్సలు నిర్వహించి కర్నూలుకు పంపుతున్నారు. కొందరు వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అత్యవసర నిమిత్తం ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఆశ్రయిస్తున్నారు.

జీజీహెచ్‌కు గుండెకు సంబంధించిన రోగులు వెళ్లినా వారికి ఎమర్జెన్సీగా ఇంజెక్షన్ టెనెక్టిక్ ప్లేస్‌ను ఇంజెక్షన్ వేసి కార్డియాలజిస్ట్ సూచనల మేరకు రోగులకు చికిత్స నిర్వహిస్తున్నారు. ఈ ఇంజెక్షన్ విలువ దాదాపు రూ.40వేల వరకు ఉంటుంది. ఇది రోగులకు నంద్యాల జీజీహెచ్‌లో ఉచితంగానే అందిస్తున్నారు. నంద్యాల జిల్లా కేంద్రమైన తర్వాత జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)గా మార్చారు. అయితే జిల్లా కేంద్రంలో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఆస్పత్రికి నంద్యాల పరిసర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో చికిత్స కోసం వస్తుంటారు. ఇటీవల రాష్ట్ర సర్వేలో నంద్యాల జిల్లాలో గుండె వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నట్లు తేలింది. ఇంత ప్రాధాన్యత ఉన్న కార్డియాలజీ విభాగం ఏర్పాటుచేయడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పవచ్చు. ఆస్పత్రి స్థాయిని పెంచారేగాని వైద్యులను నియమించడంలో మరిచిపోయారని పలువురు విమర్శిస్తున్నారు.

ఈనెల 25వ తేదీన యాల్లూరు గ్రామానికి చెందిన వెంకటేష్ నంద్యాల జీజీహెచ్‌కు చికిత్స కోసం వచ్చాడు. ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్న వెంకటేష్‌కు గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు వైద్యులు తేల్చారు. ఎమర్జెన్సీగా రాత్రికి రాత్రే వెంకటేష్‌ను కర్నూలుకు తీసుకుపోయారు. పేద కుటుంబానికి చెందిన వెంకటేష్ ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లలేక కర్నూలు జీజీహెచ్‌కు వెళ్లాడు. ప్రతిరోజు నంద్యాల జీజీహెచ్‌కు 10నుంచి 15మంది గుండె సంబంధిత రోగులు వస్తుంటారు. ఆస్పత్రి స్థాయి పెరగడంతో రోగులు హుటాహుటిన గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స ఉంటుందని ఆస్పత్రికి వస్తున్నారు. తీరా ఆస్పత్రికి వచ్చిన తర్వాత గుండెవైద్య నిపుణులు లేరని తెలియడంతో ఎక్కడికివెళ్లాలో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ విభాగం నంద్యాల జీజీహెచ్‌లో ఏర్పాటు చేయాలని సర్వత్రా కోరుతున్నారు.

కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం



నంద్యాల జీజీహెచ్‌లో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ లేదు. గుండె వైద్యనిపుణులు కూడా అందుబాటులో లేరు. కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ రాజకుమారి గనియా దృష్టికి తీసుకుపోయాం. ప్రతిపాదనలు కూడా పంపించాం. ఆస్పత్రికి వస్తున్న హృద్రోగులకు ఎమర్జెన్సీ చికిత్స అందించి కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేస్తున్నాం.

- డా.మల్లేశ్వరి, సూపరింటెండెంట్, నంద్యాల

క్యాజువాలిటీలో తక్షణమే వైద్యమందించండి

- అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేని వార్డులపై ఆరా
- జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): క్యాజువాలిటీలో రోగులకు తక్షణం వైద్యం అందించి అడ్మిషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సమీక్షించారు. ఆస్పత్రి సేవలపై ఫీడ్‌బ్యాక్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్, ఓపీ, వార్డుల్లో పనులపై రోగులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేని వార్డులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డాక్టర్ చిట్టి నరసమ్మ, శ్రీరాములు, కే.సీతారామయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రాయలసీమ సాధనే లక్ష్యం

- కుంచం వెంకటసుబ్బారెడ్డి


కమిషనర్‌తో కుంచం వెంకటసుబ్బారెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాయలసీమ రాష్ట్రమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబును కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జూలై 7న అనంతపురంలో సమితి ప్లీనరీ సమావేశాలు, బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2018 ఎన్నికల ముందు ప్రధాని నరేంద్ర మోదీ రాయలసీమకు ఇచ్చిన డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. రాయలసీమ ప్రజల మనోభావాలను దెబ్బతీయవద్దని, అమరావతికి నరేంద్ర మోదీని అహ్వానించడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3లో అన్ని రకాలైన అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. యుద్ధప్రాతిపదికన కొత్త రాష్ట్రాన్ని కూడా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంతవరకు తెలంగాణ మాదిరిగా రాయలసీమ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని చేపడుతున్నామని, పరిస్థితి చేయి దాటిపోతే కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- భయాందోళన చెందిన ప్రయాణికులు


కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

పెద్దకడుబూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి డ్రైనేజీ కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన కంబళదిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని కంబళదిన్నె గ్రామంలో మంగళవారం డ్రైనేజీ కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు భయపడి కేకలు వేశారు. ప్రయాణికులకు ఏమి కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం కాలువలో నుంచి బస్సును గ్రామస్థులు బయటకు లాగారు. ఎమ్మిగనూరు- కోసిగి ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉండటంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం


ఉద్యోగిని పరామర్శిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న పెస్ట్‌కంట్రోల్ ఏజెన్సీకి చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మహేష్ ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మూడు రోజులుగా సెలవులో ఉన్న అతడు సోమవారం రాత్రి పెస్ట్ కంట్రోల్ ఆఫీస్ బీరువాలోని ఎలుకల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బంధువులు క్యాజువాలిటీకి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వర్లు ఉద్యోగిని పరామర్శించారు. ఓ ఉద్యోగి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు అధికారులకు వివరించినట్లు తెలిసింది. తనకు 6 నెలల చిన్నారి ఉన్నట్లు అత్యవసరమైతే అనుమతి ఇవ్వటం లేదని తెలిసింది. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలకు ఆదేశించారు.

రోగులకు వైద్యసేవలు అందిస్తాం

- కలపరి గ్రామంలో పర్యటించిన రాష్ట్ర మలేరియా అధికారి


డ్రమ్మును పరిశీలిస్తున్న మలేరియా అధికారి రామనాథ్‌రావు

ఆస్పరి. ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విషజ్వరాల బారిన పడిన రోగులకు వైద్య సేవలు అందిస్తామని, ఆందోళన చెందవద్దని రాష్ట్ర మలేరియా అధికారి రామనాథ్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కలపరి గ్రామంలో పర్యటించారు. 15 రోజులుగా విషజ్వరాలు ప్రబలినట్లు వార్తలు రావడంతో ఆయన రాష్ట్ర మలేరియా డిప్యూటీ డైరక్టర్ రామనాథ్‌రావు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో భాస్కర్, జిల్లా మలేరియా అధికారి నూకరాజుతో కలిసి గ్రామంలో పరిస్థితిని పరిశీలించారు. గ్రామంలో 53 మంది నుంచి రక్త నమునాలు సేకరించి, 26 మంది రోగులను వైద్య పరీక్షల కోసం కర్నూలుకు పంపగా పది మందికి చికున్ గున్యా సోకినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. అనంతరం గ్రామానికి తాగునీరు సరఫరాచేసే ఓవర్‌హెడ్ ట్యాంకును తనిఖీ చేశారు. చేశారు. ఏడాది నుంచి ట్యాంకును శుభ్రపరచలేదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చికున్‌గున్యా ప్రాణాంతకం కాదని, తగిన జాగ్రత్తలు పాటిస్తే తగ్గించుకోవచ్చన్నారు. జ్వర పీడితుల ఇళ్లకు వెళ్లి తాగునీటి ట్యాంకులను పరిశీలించామన్నారు. గ్రామంలో ఏఎన్‌ఎం లేరని అధికారుల దృష్టికి తీసుకురాగా, వెంటనే నియమించాలని రాష్ట్ర మలేరియా అధికారి ఆదేశించారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్, మలేరియా సబ్ డివిజన్ అధికారి రఘురాంరెడ్డి, బాలకృష్ణారెడ్డి, సర్పంచు భర్త పెద్దరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, వీఆర్వో గోవింద్ ఉన్నారు.

దొంగల ముఠాకు మూడేళ్ల జైలు

- రెండు నెలల్లో శిక్ష పడేలా చేసిన తాలుకా పోలీసులు
- అభినందించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్


శిక్ష పడిన హరియాణా గ్యాంగ్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కర్నూలు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 24.. అర్ధరాత్రి 1.45 గంటల సమయం. గుర్తుతెలియని వ్యక్తులు జాతీయ రహదారి పక్కనే ఏటీఎం మిషన్‌ను దొంగలించి తీసుకెళ్తుండగా స్థానికులకు అనుమానం వచ్చింది. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీస్ వాహనం సైరన్ వినగానే దొంగల ముఠా ఏటీఎం యంత్రాన్ని వదిలేసి చీకట్లో పారిపోయారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధారాలతో అంతర్రాష్ట్ర హరియాణా రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేయడమే కాకుండా పక్కా ఆధారాలతో కేసును న్యాయస్థానంలో రుజువుచేసి శిక్ష పడేలా చేసిన కర్నూలు తాలుకా సర్కిల్, ఉల్లిందకొండ పోలీస్‌స్టేషన్ పోలీసులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. శభాష్ పోలీస్ అనిపించారు. ఎస్పీ ఇచ్చిన సమాచారం మేరకు.. కర్నూలు నగర శివార్లలోని కల్లూరు మండలం ఉల్లిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు వద్ద కర్నూలు జాతీయ రహదారి-44 సర్వీస్ రోడ్డు పక్కనే బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం కేంద్రం ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 24న అర్ధరాత్రి 1:45 గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు ఏటీఎం యంత్రాన్ని పెకలించి తాళ్లతో కట్టి హైవేపైకి లాక్కెళ్లుతున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకోబోతుండగా.. వారి వాహనం సైరన్ శబ్దం విన్న దొంగల ముఠా ఏటీఎంను వదిలేసి చీకట్లో పరారయ్యారు. పోలీసులు వెతికినా ఫలితం లేదు. ఉల్లిందకొండ పోలీస్ స్టేషన్‌లో దోపిడీ కేసు నమోదు చేశారు. అది అంతర్రాష్ట్ర ముఠా పనేనని గుర్తించిన ఎస్పీ విక్రాంత్‌పాటిల్, కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, కర్నూలు తాలూకా సీఐ చంద్రబాబునాయుడు, ఉలిందకొండ ఎస్సై ధనుంజయ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంను ఏర్పాటుచేశారు. ఏటీఎం మిషన్‌ను దొంగలించడానికి టోయింగ్ వాహనాన్ని దొంగలించినట్లు గుర్తించారు. సీసీ పుటేజీలను సేకరించారు. నేషనల్ హైవే పొడవునా టోల్‌పాజా వద్ద ఉన్న సీసీ కెమెరాలను క్షుణంగా పరిశీలించారు. హరియాణాకు చెందిన ఓ ముఠా.. కంటైనర్ డ్రైవర్‌గా హరియాణా నుంచి బెంగళూరుకు కంటైనర్‌లో కార్లు తీసుకొచ్చారు. అక్కడి నుంచి అదే కంటైనర్‌లో మారుతి సుజికీ కార్లను 23వ తేదీ కర్నూలుకు తీసుకొచ్చి అన్‌లోడ్ చేశారు. అదేరోజు తిరిగి వెళ్లకుండా నేషనల్ హైవే పక్కన ఉన్న ఏటీఎంలపై నిఘా పెట్టారు. రెక్కీ నిర్వహించాక.. 24న అర్ధరాత్రి 11.30 గంటలకు ఏటీఎం మిషన్‌ను పెకలించే పనులు మొదలు పట్టారు. 1.45 గంటలకు ఎట్టకేలకు పెకలించి.. తాళ్లుకట్టి హైవే వైపు తీసుకెళ్తుండగా స్థానికులు గుర్తించడం, వారి సమాచారం అందుకున్న పోలీసులు రావడంతో పారిపోయారు. 5-10 నిమిషాలు ఆలస్యమై ఉంటే కంటేనర్‌లో ఏటీఎంను ఎక్కించుకొని పారిపోయే అవకాశం ఉండేది. సీసీ పుటేజీలు ఆధారంగా పది రోజుల్లో కేసులు ఛేదించారు. హరియాణాకు చెందిన సూన్నీషాహీద్‌ఖాన్, సున్నీ ఇమ్రాన్‌ఖాన్, మహమ్మద్ జంసాద్‌ఖాన్, మహమ్మద్ షావ్కర్‌ఖాన్‌లే ఈఘటనకు పాల్పడ్డారని పక్కా ఆధారాలు సేకరించారు. మార్చి 6న అరెస్టుచేసి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించారు. అంతటితో ఆగకుండా సాంకేతిక ఆధారాలు సేకరించి దర్యాప్తు నివేదికను కోర్టులో ఉంచారు. స్పెషల్ మొబైల్ కోర్టు, ఎఫ్ఏసీ స్పెషల్ జేఎఫ్‌సీఎం (పీఅండ్‌ఈ) కోర్టు విచారణ నేరం రుజువు కావడంతో జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయాధికారి సరోజనమ్మ మూడేళ్లు జైలుశిక్ష, రూ.14 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసును ఛేదించడమే కాకుండా శిక్షపడేలా చేసిన కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, కర్నూలు తాలూకా సర్కిల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్సై ధనుంజయ, కోర్టు కానిస్టేబుళ్లు మహేశ్, శేఖర్ సహా నిందితులకు శిక్ష పడేలా బలమైన వాదనలు వినిపించిన ఏపీపీ అనిల్‌కుమార్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కోసిగి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామన్‌దొడ్డి గ్రామ పొలిమేర్లలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు కోసిగి సీఐ మంజునాథ్ తెలిపారు. వివరాలు.. పింజరి బషీర్ వలి పొలంలో మృతదేహాన్ని మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు అలసనూరు గ్రామానికి చెందిన చిన్నమూతి కొండయ్య, ఈరమ్మ దంపతుల కుమారుడు చిన్నమూతి నాగరాజు(38)గా గుర్తించారు. అతడు గ్రామాల్లో చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతూ జులాయిగా తిరిగేవాడని, కోసిగి పోలీస్‌స్టేషన్‌లో మూడు దొంగతనం కేసులు నమోదైనట్లు ఎస్ఐ హనుమంతురెడ్డి తెలిపారు. మృతుడి తల్లి చిన్నమూతి ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వాల ధ్యేయం

- అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి
- కేంద్ర బృందం ప్రతినిధులు
- ఉత్తమ పంచాయతీలో పర్యటన


అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

మద్దికెర, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని కేంద్ర బృందం ప్రతినిధులు షాప్రదీప్ టోపో, శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని పెరవలి గ్రామాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేయడంతో మంగళవారం కేంద్ర బృందం ఇక్కడ పర్యటించింది. గ్రామంలోని పరిసరాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజలకు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదో అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. పెరవలి ఉత్తమ పంచాయతీగా ఎంపికైందని ప్రజలందరూ గ్రామ అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయో లేదో అడిగి తెలుసుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీరు అందించాలని, నీటిఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. పంచాయతీకి గ్రామపెద్దలు, ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రతిఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలు ఖచ్చితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయ అధికారి నాగేంద్ర, డీపీవో భాస్కర్, డీఎల్‌పీవో వీరభద్రప్ప, సర్పంచ్ మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తంచౌదరి, విరాళదాత విశ్వనాథ్, హుసేన్‌సాహెబ్, ఎంపీడీవో కొండయ్య, డిప్యూటీ ఎంపీడీవో మద్దిలేటిస్వామి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నాం..



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

- డోన్‌లో ముస్లింల ప్రదర్శన

డోన్‌టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులను ఖండిస్తున్నామని ముస్లిం ఐక్యవేదిక నాయకుడు సుభాన్ అన్నారు. మంగళవారం రాత్రి ముస్లింల ఆధ్వర్యంలో ఈద్గా మసీదు నుంచి శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ పాతబస్టాండ్ వరకు చేపట్టారు. హిందూ ముస్లింలు భాయిభాయి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము ఉగ్రవాదులకు వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్య వేదిక నాయకులు మౌలాలి, చాంద్, రవూఫ్, మసీదుల మతపెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రికకు శోకం

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భార్య చదువు కోసం ఎంతో శ్రమించిన మాబాషా గుండెపోటుతో మృతి చెందాడు. భార్య, పిల్లలు బాగా చదువుకోవాలనే ఆయన జీవితకాంక్షకు విధి వెక్కిరించింది. ఎన్నో ఆశలు.. ఎందరికో ఆదర్శం కావాలనే కల కలగానే మిగిలిపోయింది. భర్త సహకారంతో తబస్సుమ్ ఇంటర్ ఉర్దూ కళాశాలలో చేరి, ఇటీవలి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచింది. ఉన్నంటుండి భర్త మరణం ఆమెను, ఆ కుటుంబాన్ని మరింత ఛిద్రం చేసింది.

- ఇంటర్ ర్యాంకర్ తబస్సుమ్ భర్త గుండెపోటుతో మృతి
- విషాదంలో కుటుంబం
- ఐదుగురు పిల్లల పరిస్థితి దారుణం



● చాగలమర్రి గ్రామానికి చెందిన తబస్సుమ్ వివాహమై ఐదుగురు పిల్లలున్నా చదువుకోవాలనే సంకల్పానికి ఊపిరిపోసిన భర్త మాబాషా ఈ రోజు ఉన్నట్లుండి గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో తబస్సుమ్ కుప్పకూలిపోయింది. ఎన్నో అవమానాలు, అవహేళనలను తట్టుకుని తన భార్య ఆకాంక్షను, ఆశయాన్ని మాబాషా ముందుకు తీసుకెళ్లాడు. అందరి నోళ్లు మూయించేలా తబస్సుమ్ ఉర్దూమీడియం(హెచ్ఎంసీ) జూనియర్ ఇంటర్‌లో 500కు 438 మార్కులు, సీనియర్ ఇంటర్‌లో 1000కి 876 మార్కులు సాధించి తబస్సుమ్ కళాశాల టాపర్‌గా నిలిచింది. ఇక టీటీసీ చేసి, ఆ తర్వాత డిగ్రీని పూర్తిచేసి గ్రూప్స్‌కు ప్రిపేర్ కావాలన్న ఆమె ఆశయానికి విధి మరోసారి వెక్కిరించింది. భార్య, ఐదుగురు పిల్లల కోసం రెక్కలు ముక్కలు చేసుకుని కుటుంబాన్ని నడిపిస్తున్న మాబాషా ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు.

● టీటీసీకి సన్నద్ధం చేస్తూ..

మాబాషా సోమవారం తన భార్య తబస్సుమ్‌తో టీటీసీ గురించి చర్చిస్తూ సమయం వృథా కాకుండా వెంటనే ప్రభుత్వ ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్‌ను కలుద్దామని చెప్పిన మరునటి రోజే ఘోరం జరిగిపోయింది.

● పిల్లల భవిష్యత్ కోసమే తపన పడ్డాం..
-తబస్సుమ్

పిల్లల భవిష్యత్ కోసమే ఇద్దరం కష్టపడుతూ వచ్చాము. మాబాషా నా చదువు కోసం ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. అయినా ఎలాగైనా మంచి చదువు చదివించుకుని, పిల్లలను తనలా కాకుండా మంచి ఉన్నతస్థాయిలో చూడాలని ఎప్పుడూ అనేవాడు. కాని విధి మమ్మల్ని వెంటాడుతోంది. ఇప్పుడు నా చదువు, బతుకుదెరువు ప్రశ్నార్థకంగా మారాయి.


కుటుంబంతో తబస్సుమ్, మాబాషా (ఫైల్)

మున్సిపాలిటీని నందనవనంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే జయసూర్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపల్ పట్టణాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్క్‌లో మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకరెడ్డి అధ్యక్షతనలో నిర్వహించారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపల్ పట్టణానికి నగరవనం రాబోతోందని అలాగే నందికొట్కూరు మార్కెట్ యార్డు నుంచి ఆత్మకూర్ రోడ్‌లోని జమ్మి చెట్టు వరకూ పట్టణంలోని కేజీ రహదారి వెంబడి డివైడర్‌ను ఏర్పాటు చేసి బటర్‌ఫ్లై లైట్లను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. పట్టణంలో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబీ, అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

నంద్యాల టౌన్ ఏప్రిల్, 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నంది పల్లె రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న నూనెపల్లె బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ కుమారి తెలిపారు. మంగళవారం ఉదయం తెల్లవారుజామున గుర్తించినట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వయస్సు 30 ఏళ్లు ఉండవచ్చునని, తెల్లని టీషర్టు, బ్లూ జీన్స్ ప్యాంట్ ఎడమ చేతిపై జేవోఏఎస్ అని ట్యాటూ, కుడి చేతి వేళ్ల వద్ద పచ్చబొట్లులు ఉన్నట్లు గుర్తించారు. చనిపోయిన వ్యక్తి ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. ఎవరైన గుర్తిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీడు భూముల సాగుకు ప్రణాళిక

పాణ్యం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఖరీఫ్ సీజన్‌లో బీడు భూములను సాగు చేసేప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు నంద్యాల ఏడిఏ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన పాణ్యం మండల ఏఓలు, గ్రామ ఉద్యాన సహాయకులు, బహుళ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుత బీడు భూములను రాబోయే ఖరీఫ్ 2025లో పొలాలను ఖాళీగా ఉంచి రబీలో పంట వేసుకున్నటువంటి రైతుల కు శిక్షణ ఇస్తు ఖరీఫ్‌లో కూడా పంట సాగు చేసేందుకు ప్రణాళిక విధానం, ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని 20 శాతం రైతులకు చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిటీ శివశంకరరెడ్డి, ఏఎస్ఓ మహబూబ్‌బాషా, ఏవో, జయప్రకాష్‌రెడ్డి, పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారు..


ఎంపీకి సమస్యను వివరిస్తున్న ప్రజలు

పాములపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే నిర్మాణపు పనుల్లో సర్వీస్ రోడ్డు వేయాలని కాంట్రాక్టర్లను కోరితే వారు బెదిరిస్తున్నారని ఎంపీ బైరెడ్డి శబరికి మొరపెట్టుకున్నారు. మంగళవారం ఎంపీ రుద్రవరం గ్రామంలో వెళ్తుండగా ప్రజలు ఆమెకు సమస్యను విన్నవించారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించారని రోడ్డుకిరువైపుల సర్వీస్ రోడ్డు ఏడు మీటర్ల వెడల్పుతో వేయాల్సి ఉండగా ఒకవైపు మాత్రం వేశారని మరోవైపు ఒక్క మీటరు కూడా లేని రోడ్డులో సర్వీస్‌రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించిన తమను కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని, పోలీసులతో కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఎంపీ మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించేల కృషి చేస్తానని తెలిపారు. ఆమెవెంట రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్‌నాయుడు, బిఎస్ఎస్ఎల్ జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్యుడు రమేశ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

నంద్యాల టౌన్ ఏప్రిల్, 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పలు రకాల క్యాటగిరిల్లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎన్ఎంయూ ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. మంగళవారం స్థానిక డిపో ఆవరణలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఎన్ఎంయూ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బరావు, యోగారెడ్డిలు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1-2019 ను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు భాగ్యలక్ష్మి, సీసీరెడ్డి, నారాయణ, నరసింహ, అబ్దుల్లా, సూర్య పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఎంపీకి ఆహ్వానం

బండిఆత్మకూరు, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవళాపురం గ్రామ శివారులో వెలసిఉన్న ఏకరాతి శిలా అభయాంజనేయ స్వామి ఆలయంలో మే నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగే ప్రతిష్ఠ ఉత్సవాలకు రావాలని ఎంపీ బైరెడ్డి శబరిని ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. మంగళవారం ఎంపీని ఆల య నిర్మాత శివరాజు నాయక్, సేవకులు ఈశ్వర్‌నాయక్, తేజనాయ క్, శివన్న, నాగరాజులు కలసి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

హానికర రసాయనాలు వాడితే చర్యలు

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పండ్ల వ్యాపారులు కాయలను తెచ్చి త్వరగా పండ్లుగా మారేందుకు హానికర రసాయనాలను వినియోగిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆహార భద్రతా అధికారులు కాశీంవలి, వెంకటరాముడులు అన్నారు. మంగళవారం ఆహార భద్రతా అధికారులు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబుతో కలిసి పట్టణంలోని పలు పండ్ల గోదాములను తనిఖీ చేశారు. అలాగే పలువురు పండ్ల వ్యాపారస్థులగోదాములు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. వీరి వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కేంద్ర నిధులతో గూడేల అభివృద్ధి: ఎంపీ

కొత్తపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో గిరిజన గూడేలను అభివృద్ధి చేస్తానని నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం మండలంలోని జానాల గూడెం, బలపాలతిప్ప గ్రామాలలో ఎంపి బైరెడ్డి శబరి, జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్‌కుమార్, ఆత్మకూరు డీఈ జయశంకర్, ఏడి రామసుబ్రహ్మణ్యం, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ 45 ఏళ్ల తర్వాత చిమ్మ చీకట్లో మగ్గిన జానాల, బలపాల తిప్ప సిద్దేశ్వరం గ్రామాలకు నేడు విద్యుత్ వెలుగులు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎస్ఈ సుధాకర్ మాట్లాడుతూ.. పీఎంజన్‌మన్ పథకం కింద సంగమేశ్వరం నుండి జానాల గూడెం వరకు 7 కిలో మీటర్ల మేర 1.6 కోట్ల నిధులు వెచ్చించి సింగిల్ ఫేస్ కరెంట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం ఎంపీ లింగాపురంలో టీడీపీ నాయకులు చిన్న పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు, ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరి, జడ్పీటీసీ సోముల సుధాకర్, రాష్ట్ర టీడీపీ నాయకులు కాకరవాడ చిన్న వెంకట స్వామి, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, నాయకులు వివారెడ్డి, భాస్కరరెడ్డి, బాలీశ్వరరెడ్డి, శ్రీనాథరెడ్డి పాల్గొన్నారు.


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

● సప్త నదుల సంగమేశ్వరం, కొలను భారతి క్షేత్రాలను నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.ఎంపీకి ఆలయ పురోహితులు తెలక పల్లి రఘురామ శర్మ,చక్రపాణి శర్మ, శ్రీనివాస శర్మ, రామయ్య శర్మ స్వాగతం పలికారు. అనంతరం ఎంపీకి స్వామి అమ్మ వార్ల చిత్ర పటాన్ని ఈవో రామలింగారెడ్డి జ్ఞాపికను అందజేశారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాల్య వివాహాలను నిర్మూలిద్దామని డీఎల్డీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం,హెల్త్ ఎడ్యుకేటర్ ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శివ కుమారిలు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం నందు అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బందికి బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.

మహానంది:బాల్య వివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్ తోట కవిత అన్నారు. మంగళవారం మహానంది మండలంలోని బుక్కాపురం లోని వెలుగు కార్యాలయంలో కిషోర్ వికాసం స్పెషల్ సమ్మర్ క్యాంపెయిన్ పై మండల అంగన్‌వాడీ వర్కర్లతో పాటు మహిళ పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, విద్య,బాలల హక్కులు,బాలల అక్రమ రవాణా, పోషకాహారం పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలోమండల ఏపీఎం తిరుపాల్‌రెడ్డి , హెల్త్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

న్యాయ విచారణ జరిపించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్ర జ్యోతి): బేవరేజెస్ హమాలీ కార్మికుల నియామకాల్లో జరిగిన అవినీతిపై న్యాయవిచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం, సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఐఎంఎల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుల కడుపుకొట్టాలని స్థానిక మంత్రి ఫరూక్ అధికారం ఉందని జిల్లా అధికారులను అడ్డం పెట్టుకొని కార్మిక చట్టాలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. కార్మికుల పోస్టింగ్‌లలో రాజకీయ జోక్యాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా 36మంది కార్మికులను చేర్పించి స్థానికంగా పనిచేస్తున్న కార్మికుల కడుపుకొడుతున్నారని ఆరోపించారు. బేవరేజెస్ హమాలీ కార్మికులకు న్యాయం జరిగేంతవరకు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో రామచంద్రుడు, తోటమద్దులు, గౌస్, బాలవెంకట్, లక్ష్మణ్, నరసింహలు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా పన్ను వసూళ్లు లేవు

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా ఎస్ఆర్‌బీసీ, తదితర సాగు నీటి శాఖల పరిధిలో పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవని శ్రీశైలం కుడిగట్టు కాలువ ఎస్ఈ రవి శేఖర్ రెడ్డి తెలిపారు. ఎస్ఈ నంద్యాలలో మంగళవారం ఎస్ఈ మాట్లాడుతూ సాగునీటి శాఖలు అందిస్తున్న సాగునీటిని వాడుకుంటున్న రైతులు పన్ను చెల్లిస్తే కాల్వ అభివృద్ధి చేసేందుకు వీలు జరుగుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు పన్ను చెల్లింపుల్లో చైతన్య వంతంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించిందని చెప్పారు. ఈ మేరకు జిల్లా అధికారులు సైతం రైతులతో పాటు సాగు నీటి సంఘాల చైర్మన్లలో చైతన్యం తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి రైతు పన్ను చెల్లిస్తే సాగునీటి ప్రాజెక్టుల నిర్వాహణలో ప్రభుత్వంపై ఆర్థిక ఒత్తిడి తగ్గుందని తెలిపారు. పన్ను చెల్లించేందుకు రైతులు సహకరించాలని కోరారు.

'డయల్ యువర్ డీఎం'కు రెండు ఫిర్యాదులు

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిధిలో మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని డిపో మేనేజర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా ఇరువురు వ్యక్తుల నుంచి తమకు రెండు ఫిర్యాదులు అందాయని వాటిని సత్వరమే పరిష్కరించినట్లు ఆయన తెలిపారు.

అంబేడ్కర్ ఆశయాలను కేంద్ర ప్రభుత్వం నెరవేరుస్తుంది



మాట్లాడుతున్న నాగోతు రమేష్ నాయుడు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలను కేంద్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల జయంత ఫంక్షన్‌హాల్‌లో ఏపీ రాష్ట్ర బీజేపీ శాఖ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అధ్యక్షతన అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా మేధావుల సదస్సుకు ముఖ్య అతిథులుగా నాగోతు రమేష్ నాయుడు, బీజేపీ నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడులు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిల్ సభ్యులు కశెట్టి క్రిష్ణమూర్తి, డా. ఆదినారాయణ, జాతీయ మైనార్టీ మోర్చా సభ్యురాలు మొమిన్ షబానా,నంద్యాల టౌన్ అధ్యక్షులు కశెట్టి చంద్రశేఖర్, కార్యకర్తలు బాలముని, నందం బాబురావు, కన్వీనర్‌లు మేడా మురళీధర్, బీజేపీ రూరల్ అధ్యక్షుడు గురుబ్రహ్మం పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పనిచేయని సీటీ స్కానర్



సీటీస్కాన్ పనిచేయకపోవడంతో మూసివేసిన సెంటరు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో గత శనివారం నుంచి సీటీస్కాన్ పనిచేయడం లేదు. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో, ప్రమాదాల్లో గాయపడిన వారికి సీటీస్కాన్ చేసిన తర్వాతే చికిత్సలు నిర్వహిస్తారు. సీటీస్కానర్ పనిచేయకపోవడంతో ఎమర్జెన్సీ వార్డులో అత్యవసర సేవలు చేయలేక వైద్యులు ప్రైవేట్‌కు, కర్నూలుకు వెళ్లాలని రోగుల బంధువులకు సూచిస్తున్నారు. సీటీస్కాన్ యంత్రంలో మరమ్మతుకోసం ఏర్పాటు చేసే పరికరం స్థానికంగా దొరకడం లేదని, ముంబైనుంచి రావాలని సీటీస్కాన్ టెక్నీషియన్ పేర్కొంటున్నారు. ఆస్పత్రిలో చికిత్స చేయాలంటే ప్రైవేట్ సీటీస్కాన్ సెంటర్‌లో ఫిల్మ్ తీసుకొనివస్తే జీజీహెచ్‌లోనే వైద్యసేవలు అందిస్తామని వైద్యులు అంటున్నారు.

దౌర్జన్యంగా తొలగించారు..

నంద్యాల టౌన్ ఏప్రిల్, 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని మున్సిపాలిటీ పక్కనే ఉన్న స్థలంలో కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా తమ వాటర్ వాష్ దుకాణాన్ని తొలగించారని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చింపింగ్ బషీర్ 2007 నుంచి గాంధీచౌక్ మసీదుకు సంబంధించిన స్థలంలో ఆద్దెకు తీసుకుని నడుపుతున్నట్లు తెలిపారు. కానీ గత నెల రోజుల నుంచి పట్టణానికి చెందిన పెద్ద నాయకుడి అల్లుడని చెప్పి, మసీదు నూతన కమిటీలో అధ్యక్షుడినని చెప్పి స్థలం ఖాళీ చేయాలని సూచించినట్లు చెప్పారు. ఇలా చెప్పకుండా కూల్చడంతో సుమారుగా రూ.6లక్షలు నష్టం వచ్చిందని తెలిపారు. రెండో పట్టణ సీఐని వివరణ అడగగా ఫిర్యాదు చేశారని విచారణ చేస్తున్నట్లు చెప్పారు.


కూల్చేసిన వాటర్ వాష్ షెడ్డు

బిక్కుబిక్కుమంటూ విధులు


ఎమర్జెన్సీ వార్డులో పీవోపీకి రంధ్రం పడిన దృశ్యం

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్‌లోని ఎమర్జెన్సీవార్డులో పీవోపీకి రంధ్రం పడి పెచ్చులు ఊడిపడుతున్నాయి. వైద్యులు కూర్చునే టేబుల్‌పైనే పెద్ద రంధ్రం పడడం పెచ్చులు రాలిపడుతుండటంతో ఇబ్బందికరంగా మారింది. ఎప్పుడు ఊడిపడుతుందోనని బిక్కుబిక్కుమంటూ అక్కడి సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఎలాంటి నష్టం జరగకముందే పీవోపీని సరిచేసి చేయాలని సిబ్బంది, రోగులు కోరుతున్నారు. నిత్యం ఆసుపత్రికి వందలాది మంది రోగులు వస్తుంటారు.

నిరుపేద కుటుంబాలకు చేయూతనివ్వండి

మిడుతూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలను బలమైన సాంఘిక సంక్షేమ కార్యక్రమాల ద్వారా చేయుతనిచ్చి వారిని ఆదుకోవాలని ఎంపీడీవో దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యలయంలో వీఆర్‌వోలకు, పంచాయతీ కార్యదర్శుకు సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుక బడిన కుటుంబాల కోసం పీ4 విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ విధానంలో 10 సూత్రాలను రూపొందించడం జరిగిందన్నారు. మండలంలో పి4 సర్వేద్వారా 1163 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించామన్నారు. ఈ కుటుంబాలకు ఎన్ఆర్ఐలు, ఆర్థిక స్థోమత కలిగిన కుటుంబాల వారు మార్గదర్శిగా ఏర్పడి చేయూతనివ్వాలని వారు కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం పోలీసులు

నంద్యాల టౌన్ , ఆత్మకూరు రూరల్ ఏప్రిల్, 29 (ఆంధ్ర జ్యోతి): జిల్లా వ్యాప్తంగా శక్తి టీం బృందాలుగా ఏర్పడి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల పట్టణంలో జీవీ మాల్, పలు వీధుల్లో, బనగానపల్లెలో తెలుగుపేటలో , ఆత్మకూరు ఆదిత్య జూనియర్ కళాశాలలో శక్తి టీం యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్లు జయరాముడు, గౌతమి, ఎస్సై ధనమ్మ లు మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ గూగుల్ ప్లే స్టోర్‌లోకి శక్తి యాప్‌కు డౌన్‌లోడు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇళ్లను నిర్మించుకునేందుకు రూ. 5లక్షలు ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాలులో సీపీఎం పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైవేలో ఇళ్లు కోల్పోయిన లబ్ధిదారులకు స్థలాలు మంజూరు చేసి, రూ 5లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర,షేక్ ఇస్మాయిల్, నాగేశ్వరరావు,భాస్కర్, సద్దాం హుసేన్‌లు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా పదోన్నతి

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో నూర్జహాన్‌కు ఎంపీడీవోగా పదోన్నతి వచ్చిందని ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం ఎంపీడీవోగా వెళ్లారు.

బాలిక అదృశ్యం

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండ్లెం గ్రామంలో మంగళవారం 17ఏళ్లబాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం చర్చిలో ప్రార్థనకు వెళ్లి తిరిగి ఇంటికిరాకపోవడంతో బంధువులు ఉన్న గ్రామాల్లో వెతికినా ఆచూకీ కనిపించలేదు. బాలిక తండ్రి మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ర్యాలీని జయప్రదం చేయండి

వెలుగోడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జేఏసీ కన్వీనర్ జవాద్ మౌళానా అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనార్టీ హక్కులను కాలరాస్తూ, మైనార్టీ హక్కులను కాలరాయలని ఈ చట్టం తెచ్చిందని అన్నారు. కార్యక్రమంలో హిదాయతత్, ఇలియాస్, రసూల్, ఖాదర్‌వలి, సయ్యద్, రఫి పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ


ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడుతున్న కల్నల్ అలోక్ త్రిపాఠి

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్ర జ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్స్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలని కర్నూలు ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ అలోక్‌త్రిపాఠి పేర్కొన్నారు. నంద్యాల శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఎన్‌సీసీ క్యాడేట్స్‌తో నిర్వహించిన సమావేశానికి కల్నల్ అలోక్‌త్రిపాఠి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్‌లు శిక్షణలో ఎన్నో విషయాలు నేర్చుకుంటారని అన్నారు.

ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ చెల్లించాలి


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్ర జ్యోతి): పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని పీఆర్‌టీయూ నాయకులు డీఈవో జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పీఆర్‌టీయూ నాయకులు రామపక్కీరారెడ్డి మాట్లాడుతూ మూల్యాంకన రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని, ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు హాజరైన ఉపాధ్యాయులకు అదనపు వేతనం చెల్లించాలని, 80శాతం పైగా పాస్ అయిన పాఠశాలల ఉపాధ్యాయులకు రెమెడియల్ క్లాసుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జగదీష్‌బాబు, మధుసూదన్, మోహన్‌రెడ్డి, బాపూజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బనగానపల్లెలో పాలీసెట్

- నాలుగు పరీక్షా కేంద్రాలు

బనగాన పల్లె, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తొలిసారి పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వాసవీ పాలిటెక్నిక్ కళాశాల సూపరింటెండెంట్ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలో నిర్వహిస్తున్న పాలీసెట్‌లో 891మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు పేర్కొన్నారు. బనగానపల్లె పట్టణంలో వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో 341 మంది, ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో 200 మంది, శ్రీసాయిసిద్దార్థ జూనియర్ కళాశాలలో 150 మంది, కంకరగురెడ్డి కళాశాలలో 200 మంది ప్రవేశపరీక్షలు రాయనున్నారన్నారు. ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లను, డిపార్టుమెంటల్ అధి కారులను కూడా నియమించినట్లు తెలిపారు.

చౌడేశ్వరీ ఆలయంలో హుండీ లెక్కింపు


ఆలయంలో హుండీని లెక్కిస్తున్న భక్తులు

బనగానపల్లె, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో మంగళవారం ఈవో కామేశ్వరమ్మ, దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. హుండీ ద్వారా రూ.19.84 లక్షల నగదు, 48.2 గ్రాముల బంగారు, 3.150 గ్రాముల వెండి ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ తనిఖీ అధికారి భరత్, ఆలయ అర్చకులు, నందవరం గ్రామీణ బ్యాంక్ క్యాషియర్ అఖిల్, నంద్యాల బాలాజీ సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేలం వాయిదా

నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో తలనీలాలు, చెప్పుల స్టాండ్‌కు సంబంధించి వేలం మంగళవారం ఈవో కామేశ్వర మ్మ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. అయితే పాటదారులు ఎవ్వరూ డిపా జిట్ చెల్లించడానికి ముందుకు రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు. మే 2న మరోసారి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి నోచుకోని రామరత్నగిరి

- జాడే లేని సిమెంటు రోడ్లు • పట్టించుకోని అధికారులు


ఇళ్ల ముందు మట్టి రోడ్డు ఇలా..

ప్యాపిలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆ గ్రామం అభివృద్ధికి దూరంగా ఉంది. కనీసం గ్రామంలో సిమెంటు రోడ్లు కూడా లేవు అంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థమవుతుంది. అయినప్పటికీ పాలకులు గానీ అధికారులు గాని ఆ గ్రామం గురించి పట్టించుకోకపోవడంపై ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఊటకొండ గ్రామపంచాయతీలో రామరత్నగిరి మజార గ్రామం. ప్రభుత్వాలు మారుతున్నాయని గాని ప్రజలకు అవసరమైన వసతులు కల్పించకపోవడంతో మజార గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో కనీసం ఇళ్ల ముందర మట్టి రోడ్లు కూడా లేవు. దీంతో ఇంటి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ గ్రామంలో సిమెంటు రోడ్లు నిర్మించడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని మజార గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఫోన్ చేయాలంటే మిద్దె ఎక్కాల్సిందే..?

- గొర్విమానుపల్లె వాసులకు తప్పని సిగ్నల్స్ కష్టాలు
- సెల్ టవర్ ఏర్పాటు చేయాలంటున్న గ్రామస్థులు


మిద్దె ఎక్కి మాట్లాడుతున్న గ్రామస్థుడు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యో తి) : ఇటీవలి కాలంలో సెల్ ఫోన్ వినియోగం సర్వ సాధారణంగా మారింది. అయితే సెల్ ఫోన్ సిగ్నల్స్ అందక గొర్విమానుపల్లె వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సుమారు 3500కు పైగా జనాభా ఉన్నారు. ఫోన్ రిసీవ్ చేసుకున్నా హలో .. హలో .. అంటూ అరవడం తప్ప అటువైపు నుంచి స్పష్టంగా మాటలు వినపడకపోవడంతో ఫోన్ మాట్లాడాలంటే ఇంటిపైకి ఎక్కి మాట్లాడాల్సిన వస్తోందని ప్రజలు వాపోతున్నారు. అలాగే ప్రతినెలా పింఛన్, రేషన్ పంపిణీకి ఇబ్బందులు తప్పడంలేదని సిబ్బంది వాపోతున్నారు. సరైన సిగ్నల్స్ లేకపోవడంతో, సర్వర్ పని చేయక గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని వాపోతున్నారు. దీంతో ఇటు ప్రభుత్వ ఉద్యోగులు, అటు లబ్ధిదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరోవైపు ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధరకాల సర్వేలకు సిగ్నల్స్ ఎఫెక్ట్ పడుతోంది. పాలకులు స్పందించి గ్రామానికి సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, గ్రామస్థులు కోరుతున్నారు.

పశుగ్రాసానికి గిరాకీ

- ట్రాక్టర్ గ్రాసం రూ.15 వేలు నుంచి రూ.30 వేలు

చాగలమర్రి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం ధర పెరగడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది వేరుశనగ పంట సాగు తగ్గడంతో గ్రాసం కొరత ఏర్పడింది. గ్రాసం ధరలు పెరగడంతో పశుపోషణ భారమైందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 10 వేల గేదెలు, ఎద్దులు, 24 వేలు గొర్రెలు, మేకలు ఉన్నాయి. ట్రాక్టర్ వేరుశనగ గడ్డి రూ.15 వేలు నుంచి రూ.30 వేలు పలుకుతోంది. ఇంత అధిక ధరలు పెట్టి పోషించాలంటే కష్టమని పాడి రైతులు పేర్కొం టున్నారు. పశుగ్రాసం ధరలు పెరిగిన పాల ధరలు మాత్రం పెరగక పోవడంతో పాడి పశువుల పోషణ కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పశుగ్రాసం ధరలు పెరగడంతో కొనలేక పోతున్నామని, ప్రభుత్వం స్పందించి పశుగ్రాసం పంపిణీ చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సంపద సృష్టి జరిగేనా..?

- గత ఆరేళ్లుగా చెత్త సంపద కేంద్రాలకు చెదలు
- టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయాలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు చెదలు పట్టాయి. స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో చెత్త నుంచి సంపద సృష్టించడానికి 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం కొలిమిగుండ్ల, మీర్జాపురం, పేట్నీకోట, ఇటిక్యాల, అంకిరెడ్డిప ల్లె, బెలుం, చింతలాయపల్లె తదితర సుమారు 22గ్రామాల్లో రూ. కోట్లు వెచ్చించి వర్మీకంపోస్టు యూనిట్లు నిర్మించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం చెత్త పన్ను విధించడంలో కనబరచిన ఆసక్తిని సేకరించి, సంపద సృష్టించడంలో చూపలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో ప్రజలకు చెత్త కష్టాలు తప్పడంలేదు. ప్రధా నంగా కొలిమిగుండ్ల మండల కేంద్రంలో గ్రామానికి దూరంగా డంపింగ్‌యార్డు కేంద్రాన్ని నిర్మించ డం, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో చెత్త సేకరణ జరడం లేదు.


కొలిమిగుండ్లలో నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం


ఎర్రవాగులో పేరుకుపోతున్న చెత్త

దీంతో ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను కాల్వల్లోనూ, ప్రధాన రహదారుల పక్కన పడేస్తుండడంతో చెత్త సంపద కేంద్రాలకు చెత్త వెళ్లడం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారి శిథి లావస్థకు చేరుకుంటు న్నాయి. అయితే రాష్ట్రంలో తిరిగి మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో చెత్త సంపద సృష్టిపై ఆశలు రెకెత్తుతున్నాయి. ఇప్పటికే చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించి, సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కింది స్థాయి అధికారులు త్వరిత గతిన చర్యలు చేపట్టి చెత్త సంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రమణ

బనగానపల్లె, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు సంభవించే సమయంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీవో రమణ సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దారు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు నుంచి వచ్చిన ప్రత్యేకశిక్షకుడు మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, కరువు కాటకాలు, అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమా వేశంలో వ్యవసాయ శాఖ ఏవో సుబ్బారెడ్డి, సీడీపీవో ఉమామహేశ్వరి, ఏపీఎం శ్రీనివాసులు , మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : ముందుజాగ్రత్తల చర్యలు చేపట్టడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని తహసీల్దార్ పవన్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో విపత్తుల నివారణపూ అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో వర ప్రసాదరావు, ఏవో నిరంజన్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఏపీఎం శేఖర్, విద్యుత్ ఏఈ అనంతరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు చంద్రమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా డిప్యూటీ గణాంకాల శాఖ అధికారి చితంబరయ్య అవగాహన కల్పించారు. సమావేశంలో తహసీల్దారు భారతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


బనగానపల్లె డిపో అవరణలో రిలే దీక్షలు చేపట్టిన ఆర్టీసీ కార్మికులు

బనగానపల్లె, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల, కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ డీపో కార్యాలయం ఆవరణంలో తమ డిమాండ్లు నెరవేర్చాలని అసోసియేషన్ యూనియన్ డిపో కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు జమ్ములయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్క రించాలని, నాలుగేళ్లుగా ఆగిన పదోన్నతులు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఓబులేసు, ఎస్ఎస్ వలి, ఎల్ల య్య, ప్రహ్లాద, కె.బాబు, పి.రాజు, రసూల్, శివుడు, సలాంమియా, నారాయణ, రమణ, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ఆళ్లగడ్డ డిపో ఎంఎన్‌యూ కార్యాదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్మికులు విధులు బహిష్కరించి నిరసనలో పాల్గొన్నారు. కార్మికుల ప్రయోజనాలు కాపాడేలా రూపొందించిన 1/90 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయ్యాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

బొమ్మల కథలతో విద్యాభ్యాసం

సంజామల,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మంగళవారం సమ్మర్ ఓరియంటేషన్‌లో భాగంగా గ్రంథాలయ అధికారి బాల తిమ్మారెడ్డి విద్యార్థులకు బొమ్మల ద్వారా కథలు చదివించి వినిపించారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇబ్రహీం, చిన్నరాం పుల్లయ్య, డీఆర్‌డీఏ రాముడు, మధు, సురేంద్ర, అఖిల్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి అఖిలా బేగం అన్నారు. మంగళవారం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు.

కిశోర బాలికల కమిటీలు చేద్దాం


రుద్రవరంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో తేజేశ్వరి

రుద్రవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల కమిటీలను ఏర్పాటు చేసి చైతన్య పరుద్దామని ఐసీడీఎస్ సీడీపీవో తేజేశ్వరి, ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో వారు మాట్లాడుతూ మే 2నుంచి జూన్ 10 వరకు సమ్మర్ క్యాంటీన్ ప్రోగ్రాం విలేజీ కమిటీలు కొనసాగుతాయన్నారు. ఒక్కొక్క కమిటీలో 20మంది సభ్యులు ఉంటారన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కిశోర బాలికల సంరక్షణ..

సంజామల: కిశోర బాలికల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ఎం పీడీవో సాల్మన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసంపై వేసవి ప్రత్యేక సదస్సును నిర్వహించారు. ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శాంత, సుగుణ, కిశోర బాలికల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో మండల పరిషత్ ఏవో విజయ్ కుమార్ రెడ్డి, ఈవోఆర్డీ రాధికారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ,అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే సకాలంలో పూర్తి చేయండి


మాట్లాడుతున్న ఆర్డీవో నరసింహులు

డోన్ టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రీసర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీవో నరసింహులు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్‌లో డోన్ డివిజన్‌స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నిర్దేశిత సమయంలోగా రీసర్వేను పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్లు నాగమణి, ప్రకాశ్‌బాబు, భారతి, డిప్యూటీ తహసీల్దార్లు సునీల్ రాజా, మండల సర్వేయర్ జగదీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పనిముట్లు పంపిణీ


సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్

డోన్ టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 18 రకాల వృత్తుల వారికి ఉచితంగా శిక్షణ ఇస్తూ, పనిముట్లను, సర్టిఫికెట్లను అం దించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు అన్నారు. మంగళవారం పట్టణంలో పోటాన్ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి రూ.15వేల విలువ చేసే పనిముట్లు, సర్టిఫికెట్లను అందజేశారు. త్వరలో రూ. మూడు లక్షల సబ్సిడీ లోన్లను ప్రభుత్వం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ ఇంచార్జీ సాయినాథ్, స్మిత తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఇలా.. ప్రయాణమేలా?


పెద్దకంబలూరు - డికొట్టాలు మధ్య రహదారి వెంట పెరిగిన కంపచెట్లు

రుద్రవరం, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకంబ లూరు - డి.కొట్టాల గ్రా మాల మధ్య రహదారి గుంతలమయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి ప్రయాణమేలా అని రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికా రులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇలాగైతే రాకపోకలు కొనసాగించేదెలా అన్నారు. ఈ రహదారికి ఇరువైపులా సుమారు 200 ఎకరాలు భూములున్నాయన్నారు. ఈ భూముల్లో వరి, మొక్కజొన్న, మినుము పంటలు సాగు చేశారు. పంట దిగుబడులు రవాణా చేయాలన్నా ఇబ్బంది తప్పడం లేదు. అధికారులు స్పందించి కంప చెట్లు తొలగించి రోడ్డు వేయించాలని కోరుతున్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామ మెట్టవద్ద వెలసిన ఆంజనేయస్వామికి వైశాఖ శుద్ధ విదియ పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన క్రిష్టయ్య, క్రిష్టమ్మ దంపతులు స్వామికి వారికి కుంకుమార్చన, సింధూర, ఆకు పూజ చేశారు. అర్చకుడు స్వామి వారికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పూజలు చేశారు.


ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కాంట్రాక్టు కార్మికులకు ప్రమాద బీమా


మాట్లాడుతున్న ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మేజరు గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేసే ప్రతి కాంట్రాక్టు కార్మికులకు ప్రమాద బీమా వర్తింపజేసేలా చర్యలు చేపట్టినట్లు ఇన్‌చార్జి ఈవో ప్రకాశ్‌నాయుడు తెలిపారు. మంగళవారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మెట్ల సరళ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఈవో ప్రకాశ్‌నాయుడు మాట్లాడుతూ పలు కాలనీల్లో సీసీ రోడ్లు, కాల్వలు వేయుటకు ప్రతిపాదనలు పంపామన్నారు. మార్చి 31 నాటికి జమా ఖర్చులను సభ్యులకు వివరాలను వెల్లడించారు. సమావేశంలో ఉపసర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేంద్రప్రసాద్

చాగలమర్రి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరుగకుం డా చూడాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. మం గళవారం ఎంపీడీవో కార్యాల యంలో బాల్య వివాహాలు, కిషోర వికాసం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుశీల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు, పొదుపులక్ష్మి మహిళలతో అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఎంపీడీవో మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత అన్నారు. ప్రతి బాలిక బడికి వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రామలింగారెడ్డి, సుశీల పాల్గొన్నారు.

2న బందేషావలి ఉరుసు

చాగలమర్రి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం వీధిలో వెలసిన బందేషావలి ఉరుసు మే 2న ని ర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌బాష మంగళవారం తెలిపారు. 1న గంధం, 2న ఉరుసు మహోత్సవం ఉంటుందన్నారు. ఉరుసును జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నోట్ పుస్తకాల మంజూరు

చాగలమర్రి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత, యూపీ పాఠశాలలకు 27,916 నోట్ పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈవో న్యామతుల్ల మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరానికి నోట్ పుస్తకాలు సరఫరా చేశారని తెలిపారు. ఎంఈవో కార్యాలయంలో నోట్ పుస్తకాలను భద్రపరిచామని అన్నారు. పాఠశాలలు ప్రారంభం కాగానే ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేస్తామని పేర్కొన్నారు.

జొన్న విక్రయానికి నమోదు తప్పనిసరి

చాగలమర్రి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన జొన్నలను మద్దతు ధరతో విక్రయించుకోవాలంటే తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో రంగసేతాజీ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్వింటా జొన్నలను రూ.3,371 ధరతో మార్కెట్ యార్డులో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మద్దతు ధరతో విక్రయించుకోవాలంటే ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, పొలం పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం తీసుకొని వెళ్లాలని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

దెబ్బతిన్న భవనాల పరిశీలన

చాగలమర్రి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో దెబ్బతిన్న పాత భవనాలను ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ భవనం పైకప్పు పెచ్చులూడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవనాన్ని కూల్చివేసి నూతన గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఎంసీవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

చాగలమర్రి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ తెలిపారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలో కూలూరు రహదారిలోగల మురుగు కాలువను పరిశీలించారు. మురుగు నీరు పోయేందుకు ముల్ల కంపలు, పూడిక తొలగింపు చేసి నీరు పోయేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు

రుద్రవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీలకు ఎట్టకేలకు వేతనాలు మంజూరు అయ్యాయి. మంగళవారం ఎంపీడీవో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ప్రభుత్వం వేతనాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ వేతనం అందిస్తున్నామన్నారు. మండలంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు రూ. 306 కూలి పడేవిధంగా పనిచేయాలని అన్నారు.

వ్యక్తిగత దూషణ తగదు



మాట్లాడుతున్న గుమ్మకొండ సర్పంచ్ దశరథరామిరెడ్డి

డోన్ రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు వ్యక్తిగత దూషణలు చేయడం తగదని గుమ్మకొండ సర్పంచు దశరథరామిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న భారీ మద్యం కుంభకోణంలో అప్పటి ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పాత్రపై అనుమానాలు వ్యక్తం చేశామన్నారు. దానిపై వైసీపీ నాయకులు స్పందించకుండా తనపై వ్యక్తిగత దూషణలకు దిగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో సిట్ అధికారులు సమగ్ర విచారణ చేస్తున్నారని వాటిలో ఎవరి పాత్ర ఉన్నా వారిపై చర్యలు ఉంటాయని ఆయన అన్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన ఎమ్మెల్యే


మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడును మంగళ వారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో తాగు, సాగు నీటికి తీసుకోవాల్సిన చర్యల గురించి మంత్రికి వివరించారు. నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి నిమ్మల సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే అఖిలప్రియ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్‌టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదుర్తి సబ్‌స్టేషన్ పరిధిలో పనుల కారణంగా బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర మంగళవారం తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.